# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-08-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు.**

**2.** **భారీ వర్షాల దృష్ట్యా అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ యాదవ్ అధికారులను ఆదేశించారు.**

**3.** **తెలంగాణలో చేనేత ఉత్పత్తులపై విధించిన జిఎస్టీని తొలగించాలని చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రప్రభుత్వాన్ని కోరారు.**

**4.** **రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పనిచేస్తోందని చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత పేర్కొన్నారు.**

**5.** **రిజిస్ట్రేషన్ సేవల కోసం సమీకృత భవనాలను అందుబాటులోకి తెస్తున్నామని తెలంగాణ రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ రాజధాని గ్రామాల్లో 904 కోట్ల రూపాయల తో మౌలిక వసతుల పనులు చేపట్టామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన 51వ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ– సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో 9 ప్రతిపాదనలకు ఆమోదం తెలియచేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాజధానిలో చేపట్టే నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. పనుల వివరాలను ఎప్పటికప్పుడు తెలియచేసేలా ఆన్ లైన్‌లో అందుబాటులో ఉంచాలని అన్నారు.

--------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా బలపడిందని అమరావతిలో వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ వాయుగుండం ఈరోజు ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిషా మధ్య తీరం దాటే అవకాశముందని, దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి జి.లక్ష్మి తెలియజేస్తూ...

వాయిస్ ..30 సెకన్లు

---

ఆంధ్రప్రదేశ్‌లో పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిలోని సచివాలయంలో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉత్తరాంధ్రలో పలుచోట్ల నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహించడం, కొండప్రాంతాలు కోతలకు గురికావడంతో అధికారులు ముందస్తు జాగ్రత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు సమాచారం అందించేలా అన్ని జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు.

---

భారీ వర్షాల నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో అంటువ్యాధుల సన్నద్ధతపై మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల వరకు వర్షాలు పడే అవకాశం ఉన్నందున అంటు రోగాల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో నమోదైన కేసుల ఆధారంగా గుర్తించిన సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.

---

వాయుగుండం ప్రభావంతో తెలంగాణలోనూ రానున్న మూడురోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని, ఈ మేరకు ఆయా జిల్లాలకు రెడ్ ఆలర్ట్ జారీ చేసింది.

ఇది ఇలా ఉండగా.. ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని మేడారంలో జంపన్నవాగు, రామన్నగూడెం వద్ద గోదావరి వరద ఉధృతిని పంచాయితీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క నిన్న పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..

..వాయిస్.. 31 సెకన్లు

---

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను, వసతిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. విశాఖపట్నంలో నిర్వహించిన సాంఘిక సంక్షేమ శాఖ ప్రాంతీయ సదస్సులో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ వసతి గృహాల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ..

..వాయిస్..30 సెకన్లు

---

ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని పర్యాటక

శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఢిల్లీలో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో మంత్రి నిన్న సమావేశమైయ్యారు.. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో 270 కోట్ల రూపాయల పర్యాటక ప్రాజెక్టుల నివేదికలను కేంద్ర మంత్రికి అందజేశారు. అనంతరం కందుల దుర్గేష్ మాట్లాడుతూ, ఆంధ్ర కశ్మీర్ గా పేరొందిన లంబసింగిలో ఎక్స్పీరియన్స్ సెంటర్, బౌద్ధ వారసత్వాన్ని ప్రోత్సహించేలా తొట్లకొండ, నాగార్జున కొండ బుద్దిస్ట్ సర్క్యూట్ లు, చారిత్రక, నేపథ్యం కలిగిన లేపాక్షిలో సాంస్కృతిక కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలను కేంద్రమంత్రికి అందించామని తెలిపారు.

---------------------------

తెలంగాణలో చేనేత ఉత్పత్తులపై 5 శాతం విధించిన వస్తు, సేవల పన్ను-జిఎస్టీని తొలగించాలని చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రప్రభుత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలో చేనేత కార్మికుల ప్రయోజనాలను కాపాడాలని కోరుతూ కేంద్ర హస్తకళలు, చేనేతశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ కు లేఖ రాశారు. చేనేత ఉత్పత్తులపై పన్నులు విధించడంతో ధరలు పెరిగి, వినియోగం తగ్గుతుందని పేరొన్నారు. చేనేత రంగానికి ఉపాధి కల్పించడడంతో పాటు ఉత్పత్తులను జిఎస్టీ నుంచి మినహాయించే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

---------------------------

రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పనిచేస్తోందని చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత అన్నారు. అన్నదాత సుఖీభవ నగదు జమ చేసిన నేపథ్యంలో శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలో రైతులు నిర్వహించిన ట్రాక్టర్ల ర్యాలీలో మంత్రి నిన్న పాల్గొన్నారు. అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ ..25 సెకన్లు

---------------------------

ప్రజల సౌకర్యం కోసం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు సమీకృత భవనాలను అందుబాటులోకి తెస్తున్నామని తెలంగాణ రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. హైదరాబాద్ లోని గచ్చిబౌలిలో నిర్మించనున్న భవనానికి ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి రేపు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. ఈ ఏర్పాట్లపై రిజిస్ట్రేషన్లశాఖ అధికారులతో మంత్రి నిన్న సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి రెవెన్యూ శాఖ పర్యవేక్షణ, పనితీరు మెరుగు కోసం పలు కార్యాలయాలను ఒక చోటికి చేర్చుతూ సమీకృత భవనాలను నిర్మిస్తున్నామని అన్నారు . మొదటి దశలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 సమీకృత భవనాల పరిధిలోకి తీసుకొస్తామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఈరోజు ప్రపంచ ఛాయా చిత్ర దినోత్సవం-వరల్డ్ ఫోటోగ్రఫీ డే... నిర్వహిస్తున్నారు. ఫోటోలు తీయడం ఒక అద్భుతమైన కళ. ఎన్నో భావాలను ఒక్క చిత్రంతో తెలియజేసే గొప్పదనం ఒక్క ఫోటోకు మాత్రమే ఉంటుంది. ప్రస్తుత ఆధునిక కాలంలో మానవ జీవితంతో ఫోటోగ్రఫీకి విడదీయలేని బంధం ఉంది. ఫోటోగ్రఫీ కళ పట్ల అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఫోటోగ్రఫీ దినోత్సవం నిర్వహిస్తున్నారు. 1839వ సంవత్సరం ఆగస్టు 19వ తేదీన ఫ్రెంచ్ ప్రభుత్వం ఫోటోగ్రఫీ హక్కులను ప్రపంచానికి ఉచితంగా అందజేయడంతో అప్పటి నుండి ప్రతిఏటా ఆగస్టు 19వ తేదీన ఫోటోగ్రఫీ దినోత్సవం నిర్వహించాలని ఐక్యరాజ్య సమితి పిలుపునిచ్చింది.

ప్రపంచ ఛాయా చిత్ర దినోత్సవం సందర్భంగా ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

====================